www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 13 సెప్టెంబర్ 2023

5

అన్నమయ్య

పిల్లలు, గర్భిణులకు తప్పక టీకాలివ్వాలి : డిఐఒ

పీలేరు: ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. మంగళవారం రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దొడ్డిపల్లి సచివాలయం, నాలేవాండ్లపల్లి గ్రామం, బాలంవారిపల్లి సచివాలయంలలో జరిగిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని ఆమె అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 ఏళ్ళలోపు పిల్లలు, గర్భిణులకు క్రమంగా ఇచ్చే టీకాల కార్యక్రమంలో అన్ని రకాలు టీకాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. వాక్సిన్‌తో నివారించగల వ్యాధుల నుంచి ప్రతి బిడ్డకూ 100 శాతం రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ముఖ్యంగా అత్యంత సమశ్యాత్మక ప్రాంతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టీకాల కార్యక్రమం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు రమాదేవి, గంగులమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డిఐఒ ఉషశ్రీ

'ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి'

వీసిలో పాల్గొన్న కలెక్టర్ గిరీష, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి రాయచోటి

ప్రత్యేక ఓటరు జాబితా 2024 సంక్షిప్త సవరణకు సంబంధించి ఓట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి 'ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2024'కు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీష, జెసి ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ పాల్గొన్నారు. నూతన పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఈ నెల 23లోగా ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆయా జిల్లాలకు అందిన ఇవిఎంలను స్కానింగ్ చేసి ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలో తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో కలెక్టర్లందరూ కృషి చేయాలని ఎన్నికల ప్రధాన అధికారి పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. 2022 జనవరి 6వ తేదీ నాటి ఓటరు జాబితాలో తొలగింపులకు సంబంధించి 21,725 డెత్ ఓటర్లలో 21,395 క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించామని చెప్పారు. మిగిలిన వాటిని ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని వివరించారు. పొలిటికల్ పార్టీల నుంచి అందిన డెత్, పర్మినెంట్లీ షిఫ్టెడ్, మల్టిపుల్ ఎంట్రీస్ ఫేక్, డోర్ నెంబర్ నాట్ అవైలబుల్ కేసులను కూడా పరిశీలన చేసి రాజకీయ పార్టీలకు తెలియజేస్తున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాయచోటి, మదనపల్లె ఆర్డీవోలు రంగస్వామి, మురళి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా 'ముదివేడు' ఆర్అండ్ఆర్ ప్రక్రియ : కలెక్టర్

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో చేపట్టిన ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి డికెటి భూముల అవార్డ్స్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష ఆర్‌డిఒలు, తహశీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూసేకరణ, పరిహారం చెల్లింపు ఆర్అండ్ఆర్ కార్యక్రమాలు, గాలివీడు మండలంలోని సోలార్ పార్క్, భూసేకరణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సంబంధించి మొత్తంగా 1074.63 ఎకరాలు అవసరం కాగా వందశాతం భూసేకరణ చేశారన్నారు. ప్రభుత్వ భూమి 177.66 ఎకరాలు, 446.50 ఎకరాల పట్టా భూములు, 451.65 డికెటి భూములు ఉన్నాయన్నారు. వీటిలో మొత్తం పట్టా భూములకు అలాగే డీకేటి భూములకు సంబంధించి 274.74 ఎకరాలకు అవార్డ్స్ ప్రక్రియ పూర్తి చేశార న్నారు. ఇంకను డికెటిలో మిగిలిన 176.91 ఎకరాలకు అవార్డ్స్ జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కురబలకోట, బి.కొత్తకోట తహశీల్దార్లకు సూచిం చారు. పాజెక్టులోని ఫ్ట్రక్చర్లకు సంబంధించి సప్లిమెంట్ అవార్డులను కూడా పాస్ చేయాలని ఎస్‌సి డిసిలను ఆదేశించారు. గాలివీడు మండలం తూముకుంట, వెలిగల్లులలో ఏర్పాటు చేస్తున్న సోలార్ పార్కుకు సంబంధించి కూడా ఇప్పటికే 1115 ఎకరాలు భూ సేకరణ చేశారని మిగిలినవి త్వరగా పూర్తి చేయాలన్నారు. సేకరించాల్సిన భూమిలో డికెటి, పట్టా, అసైన్మెంట్, ప్రభుత్వ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంతమందికి పరిహారం ఇచ్చారు, ఇంకా ఎంతమందికి చెల్లింపు చేయాలన్న విషయంలో సర్వేనెంబర్ వారీగా నివేదిక సమర్పించాలన్నారు. అవసరమైన భూసేకరణలో చుక్కల భూములు ఉంటే వెంటనే సర్వే నెంబర్ వారీగా వాటిపై నివేదిక సమర్పించి తగిన అనుమతులు పొందాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించి సహాయ పునరావాస కార్యక్రమాలను, ఇండ్ల పట్టాల ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్ రెవెన్యూ, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్డీవోలు రంగస్వామి, మురళి, హెచ్ఎంఎస్ఎస్ యూనిట్-2 ఎస్‌డిసి గోపాలకృష్ణ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

అభివృద్ధి పనులకు భూములు గుర్తించాలి

జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వ భూములు గుర్తించాలని కలెక్టర్ గిరిష సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్లోని మినీ విసి హాల్ నుంచి భూ సేకరణపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అసైన్మెంట్ భూములు, ఇనామ్ భూములను గుర్తించి వెంటనే తమకు రిపోర్టు పంపాలన్నారు. జిల్లాలోని సంబంధిత తహశీల్దార్లు సర్వే నెంబర్ల వారీగా భూములు గుర్తించాలని ఈ కార్యక్రమాన్ని తహశీల్దార్లు, సీరియస్‌గా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని సంబంధిత ఆర్‌డిఒలు అసైన్మెంట్, ఇనాం భూముల సేకరణపై తగు చర్యలు చేపట్టాలన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థులందరు మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కొకైన్ హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనారోగ్యానికి గురై బరువు తగ్గడం, ఆందోళనకు గురికావడం, ఏకాగ్రత కోల్పోవడం, ఆకలి మందగించడం, వంటి దుష్ప్రభావాలకు గురి అవుతారని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారి కేంద్ర నాడీ మండల వ్యవస్థ అదుపుతప్పి అనారోగ్యానికి గురై ఆర్థికంగా, మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురై కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలవుతారని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజంలో మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల రోడ్డు ప్రమాదాలు, క్షణికావేశంలో తీసుకునే ప్రమాదకర నిర్ణయాలు యువత భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని వివరించారు. స్నేహితులు, బాంధవ్యాలను మరిచి కుంగిపోయి ఆత్మహత్యలకు దారితీస్తుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత మత్తు పదార్థాలు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ సూపరిండెండెంట్ శ్రీనివాస్, అసిస్టెంట్ సూపరిండెంట్ రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ధీరజ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ అధికారి కరుణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష నిర్వహించాలి : డిపిఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ ధనలక్ష్మి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిద్దామని జిల్లా పంచాయతీ అధికారి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సన్నద్ధతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ప్రతి వాలంటీర్ పరిధిలోని ప్రతి ఇంటిని ఆరోగ్య కార్యకర్త, సిహెచ్ఒ సర్వే చేసి, ఆ కుటుంబానికి అవసరమైన వైద్యాన్ని అందించమే ఆరోగ్య సురక్ష ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ముందుగా క్లస్టర్స్ వారీగా వాలంటీర్లు ఆయా కుటుంబాలకు ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తారని, అనంతరం ఎఎన్ఎం, సిహెచ్ఒ ఆ కుటుంబాలను సందర్శించి, వారి పూర్తి వివరాలను ఆరోగ్యశ్రీ యాప్‌లో నమోదుచేస్తారని చెప్పారు. మండల పరిధిలోని 22 విహెచ్‌సిలలో రెండు బృందాలుగా క్యాంపులు నిర్వహించి ప్రజలకు అవసరమైన వైద్యసేవలు అందజేయడం జరుగునని తెలిపారు. క్యాంపులు నిర్వహించే ప్రదేశం పాఠశాలలో ఉన్నట్లైతే క్యాంపు డే రోజు సెలవు మంజూరు చేయాలని ఎంఇఒకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.భానుప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎ.బావజాన్, బొమ్మనచేరువు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, అదనపు డాక్టర్ ఎం.మహ్మద్‌ఫర్‌ఖాన్ సిటిఎం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జాన్సీ, చెంబకూరు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నూరుల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా వేస్తున్న అల్లాబకాష్

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని గొర్లమ్మదివేడులో పలువురు వ్యక్తులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కోడూరు నియోజకవర్గ కన్వీనర్ ఎస్.అల్లా బకాష్ సిఎల్‌పి అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీ భారత్ జోడోయాత్రలో రాహుల్ గాంధీ చెప్పిన సంక్షేమ పథకాలకు ప్రజలకు మేలు చేసేవిగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలోనూ ,దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వారు జోష్యం చెప్పారు. అల్లా బకస్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాయచోటి నియోజకవర్గంలో బలోపేతం అవుతుందని వారన్నారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టి ప్రజలకు ఎంతో మేలు చేకూర్తోందని వారన్నారు. ఎన్నికల జరిగే సమయానికి రాష్ట్రంలోని ప్రజలు అందరూ కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతారన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు హబీబ్ ,సురేందర్ రాజు ,భరత్ కుమార్, మహేష్, వెంకటేష్, ఉపేంద్ర, రెడ్డి శేఖర్, దొరబాబు, రెడ్డప్ప ఉన్నారు.

'విశ్వం'లో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

మదనపల్లె అర్బన్: విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ బిటెక్ చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ బహుళజాతి సంస్థ హెచ్‌సిఎల్ కంపెనీ ప్రతినిధి ప్రత్యూష మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వారి భవిషత్తు అవకాశాలు గురించి, బిహేవియరల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. బిటెక్ పూర్తయేలోపు ఎలా ఎక్కువ ప్యాకేజీతో ఉద్యోగం ఎలా సంపాదించాలి, ఉద్యోగం తెచ్చుకోవటంలో కమ్యూనికేషన్ ఎలా తోడ్పాడుతుంది, ఐటి అండ్ నాన్ ఐటి జాబ్స్ మధ్య తేడా ఏంటి, ఇపుడు వున్న పరిస్తుతులో ఉద్యోగాలు ఎలా తెచ్చుకోవాలని, ప్రస్తుతం సర్వీస్ నౌ, డెవోప్స్, పైతాన్, డేటా సైంటిస్ట్,బిగ్ డేటా, డెవోప్స్ అండ్ ఏ డబ్ల్యు ఎస్, గూగుల్ క్లౌడ్, మీద ఎక్కువ ఉద్యోగ అవకాశాలు వున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.రమణారెడ్డి, ప్లేసెమెంట్ ఆఫీసర్ కేదార్ గౌరవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి : ఆర్ఎం

రాయచోటి: ఆర్‌టిసి బస్టాండ్ అవరణలో చేపడుతున్న నిర్మాణ పనుల వేగవంతం చేయాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాము పేర్కొన్నారు. మంగళవారం బస్టాండు నిర్మాణ పనులను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి బస్టాండ్‌లో నిర్వహిస్తున్న పనులను త్వరలో పూర్తి చేయాలని డిపో మేనేజర్ ధనంజయకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈనెలాఖరి లోపల నిర్మాణ పనులను పూర్తి చేయాలని తెలియజేశారు.

బస్టాండ్ పనులను పరిశీలిస్తున్న ఆర్ఎం రాము

అధికారులు అంకిత భావంతో పనిచేయాలి : 'మేడా'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండంలోని అన్ని శాఖలాధికారులు అంకితభావంతో పనిచేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి గడ్డ జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపిడిఒ రెడ్డయ్య సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా ఉపాధి ఎపిఒ శంకర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని సాలాబాద్, కొత్తమాధవరం మినహాయించి అన్ని పంచాయతీల్లో హార్టికల్చర్ కింద నిమ్మ, మామిడి మొక్కలను ఇచ్చామని చెప్పారు. రైతులు ముందుకొచ్చి మొక్కలను తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటూ సర్వసభ్య సమావేశంలో ఇచ్చిన హామీలను అధికారులు ఏమాత్రం నెరవేర్చారని ఎంపిడిఒను ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు చేయడం ఇష్టం లేకపోతే మానుకోవచ్చని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు పట్ల శ్రద్ధ వహించకపోతే తాను సహించనని పేర్కొన్నారు. మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలు, కొత్తమాధవరం ఎంపిటిసి బోగా గీతాదేవి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం గురించి తనకు సమాచారం ఇవ్వలేదని అధికారులు చాలా బాధ్యత రహితంగా ప్రవర్తిస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. పైగా తన ఓటును ఎన్నికల అధికారులు తొగించారని, తాను బతికున్నట్టా, లేక చనిపోయినట్టా అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటూ బిఎల్‌ఒను సస్పెండ్ చేయాలని తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. విఆర్‌ఒలు కూడా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వారిపైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ, ఆరోగ్య, విద్యా, పశు సంవర్ధకశాఖ, ఉపాధి, ఉద్యాన, పంచాయతీ, ఆర్అండ్‌బి అధికారులు తమ శాఖల పనితీరుపై వివరించారు. చివరగా సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు, అందరూ కూడా ప్రతి ఇంటింటికి పోయి వారి సమస్యలు తెలుసుకుని ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులున్నా వారికి అన్ని విధాలా సహాయ సహకరాలు అందించాలని సూచించారు. అంతకుముందు సాలాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన సచివాలయ భవనాన్ని ప్రారభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టరర్ వేణుగోపాల్ రెడ్డి కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫీ, ఎంపిటిసిలు, మండలంలోని అన్ని పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, ఎస్ఐ మధుసూదనరావు, పోలీసులు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'చైతన్య' సేవలు అమోఘం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు అమోఘమని సింగపూర్ దేశంలో స్థిరపడిన శక్తిప్రియ కొనియాడారు. ఆమె, వారి తల్లిదండ్రులు సుశీల, చంద్రశేఖరన్ మూడేళ్లుగా కరోనా విపత్కర సమయం నుండి ప్రతి నెలా తమవంతు సహాయ సహకారాలు అందించడమే కాకుండా సింగపూర్, మలేషియాలో మరింతమంది దాతల ద్వారా పుట్టినరోజు, పెళ్ళిరోజు వేడుకలను చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులతో జరుపుకుంటూ వస్తున్నారు. శక్తిప్రియను చిన్నారులు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. శక్తిప్రియ పిల్లల యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, సింగపూర్ నుండి పిల్లలకు అవసరమైన విద్యా సామగ్రి తీసుకువచ్చి పంచిపెట్టారు. మూడేళ్లుగా ఆహారం, ఆరోగ్యం, విద్య, వైద్యం ఇలా అన్ని రూపాలలో ఆశ్రమాన్ని ఆదుకుంటూ వస్తున్న శక్తిప్రియ నేడు ప్రత్యక్షంగా వచ్చి సంస్థను సందర్శించి పిల్లల యోగక్షేమాలు తెలుసుకొని భవిష్యత్తులో మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేయడం ఆశ్రమానికి కొండంత భరోసా కల్పించిందని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ఎంపీ ఆనందన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ పాలనాధికారులు డాక్టర్ జివిఎస్ బాబు, జనరల్ సెక్రటరీ ఎ.కవితా రాణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎ.కృష్ణచరణ్, సంస్థ సిబ్బంది, పిల్లలు, వృద్ధులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దుర్మార్గం

మదనపల్లె అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే గొప్ప సంకల్పం కలిగిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ ఆరోపించారు. మంగళవారం టిడిపి రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో తెలుగు యువత నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును ఆక్రమంగా అరెస్టు చేయడం పట్ల రాష్ట్రంలోని యువత దిగ్భ్రాంతికి గురయ్యారన్నారు. సమావేశంలో మండల అధ్యక్షులు ముద్దుకృష్ణ నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ ప్రణయ్ రాయల్, తెలుగు యువత నాయకులు గండికోట గణేష్ కుమార్, మున్నా నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

30 శాతం ఫ్యామిలీ పెన్షన్‌పై హర్షం

- ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎల్ఐసి సిబ్బందికి 30 శాతం ఫ్యామిలీ పెంపు ఈనెల 11 నుంచి అమలు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ గెజిట్ విడుదల చేయడం హర్షణీయమని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్ పేర్కొన్నారు. మంగళవారం ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఎస్.అక్బర్ బాషా ఆధ్వర్యంలో ప్రతిజ్ఞా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటం తరువాత ఇప్పటికి సాకారమయ్యిందన్నారు. సాధారణ బీమా సిబ్బందికి కూడా ఫ్యామిలీ పెన్షన్ పెంపు వర్తింపచేస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసిలో తొలిసారిగా 1997లో పెన్షన్ స్కీము సాధించిపెట్టిన యూనియన్ నేత ఎన్ ఎం సుందరం చిత్రపటానికి వారు పుష్పగుచ్చాలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగుల పెన్షనర్ల సంఘాల నాయకులు అజయ్ కుమార్, అమీనా పర్వీన్, రాజు, నజీరుల్లా, కుమార్, శ్రీకృష్ణ, వసుప్రద, శ్రీవాణి, జయచంద్ర, రఘు, ఎల్లయ్య, నరసయ్య పాల్గొన్నారు.

కడప జిల్లా ఎస్‌పిని కలిసిన రామకృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప జిల్లా నూతన ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన సిద్దార్థ కౌశల్‌ను ఎస్‌సి, ఎస్‌టి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సత్యాల రామకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పట్ల చర్చించారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించండి

- ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని

సమావేశంలో మాట్లాడుతున్న సిజిఎం ధర్మజ్ఞాని

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగి తాము చేయబోయే పనిమీద ముందుగా లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ధర్మజ్ఞాని అన్నారు. ప్రధానంగా విద్యుత్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం కడపలోని విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా అధికారులతో ఆర్థిక ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్ స్టాప్ సర్వీసులు, విద్యుత్ చౌర్యంపై వేసిన అపరాధ రుసుములు, డెవలప్మెంట్ ఛార్జీలు, మొండి బకాయిలు మొత్తం జిల్లాలో రూ.47 కోట్ల మేర పేరుకపోయాయని పేర్కొన్నారు. ఏ రోజుకు ఆ రోజు డబ్బులు చెల్లించి విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తు న్నామని చెప్పారు. వినియోగదారులు వారి విద్యుత్ సమస్యలపై కార్యాలయాలకు వచ్చినప్పుడు మర్యాదపూ ర్వకంగా వారితో మమేకమై వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్పొరేట్ ఆఫీస్ తిరుపతి నుంచి రెవెన్యూ అధికారి శ్రీధర్, ఎవైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.రమణ, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ మధు, అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున్, కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. నరసింహ ప్రసాద్, ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా అకౌంట్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం

"ప్రతి అక్షరం - ప్రజల పక్షం" అన్న నినాదంతో నిజాలను నిర్భయంగా వ్రాస్తూ, కార్మికులు, కర్షకులు, ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా నిలుస్తున్న ప్రజాశక్తి తెలుగు దినపత్రిక 42 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని నేడు 43వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా 'ప్రజాశక్తి' యాజమాన్యానికి, సిబ్బందికి, రిపోర్టర్లకు, పాఠకులకు, అభిమానులకు ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.

ప్రజాశక్తి అభిమాని

పీలేరు మండలం.

రోగులకు చికిత్స అందిస్తున్న 104 సిబ్బంది

ప్రజలకు అందుబాటులో 104 సేవలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లె గ్రామంలో మంగళవారం పేద ప్రజలకు అందుబాటులో 104 వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని డాక్టర్ సానేశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మెరుగైన వైద్యం నోచుకోని వారికి కూడా 104 వాహనం ద్వారా గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దకే వెళ్లి అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. రోగికి చికిత్సతో పాటు మందులను పంపిణీ చేసి ఆరోగ్య సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయానికి నెలకు రెండుసార్లు వాహనం అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 67 రోగాలకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రోగికి అవసరమైతే మెరుగైన చికిత్స కోసం పెద్ద ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని తెలిపారు. రోగులకు బిపి, షుగర్, యూరిన్ టెస్ట్ మొదలగునవి చేస్తున్నామని సిబ్బంది తెలపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ నాగజ్యోతి ఎఎన్ఎం సరస్వతి, ఆశ వర్కర్ రాధమ్మ, రమణమ్మ, గ్రామస్తులు 104 సిబ్బంది పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీలో దాదాపు 24 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించడం అన్యాయమని, తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాంబశివ, సురేష్ కుమార్‌లు మాట్లాడుతూ దాదాపు 24 సంవత్సరాలుగా ప్రజలకు అనేక సేవలు అందించిన కార్మికులను 60 సంవత్సరాలు పూర్తి కాకపోయినా అకారణంగా తొలగించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, అంజినేయులు, శ్రీనివాసులు, గంగులమ్మ గోపాల్, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిడిలు అందిస్తున్న బ్యాంక్ మేనేజర్

పేద విద్యార్థులకు వరం విద్యాజ్యోతి

ప్రజాశక్తి-ములకలచెరువు

పేద విద్యార్థులకు కెనరా విద్యాజ్యోతి పథకం ఓ వరమని ములకలచెరువు కెనరా బ్యాంక్ మేనేజర్ రవితేజ, ఎపిఎం హరినాథ్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పి హైస్కూల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఆరుగురు విద్యార్థులకు కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రతి విద్యార్థి చరవాణిలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. 5,6,7వ తరగతి విద్యార్థులకు రూ.2500లు, 8,9,10వ తరగతి విద్యార్థులకు రూ.5వేలు చొప్పున పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల పూర్వపు విద్యార్థి పాఠశాల తరగతి గదులకు రూ.5వేలు విలువ చేసే తాళాలు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారెడ్డి, ఎఇఒ వెంకట రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ కల్నల్ అభిషేక్‌రెడ్డిని సన్మానిస్తున్న మానవత సభ్యులు

లెఫ్టినెంట్ కల్నల్‌కు సన్మానం

ప్రజాశక్తి-చిట్వేల్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మైలపల్లి గ్రామానికి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అభిషేక్‌రెడ్డి సిడిఎస్ పురస్కారం అందుకున్న సందర్భంగా మంగళవారం గ్రామంలోని చెన్నకేశవ స్వామి కల్యాణ మండపంలో మానవత ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిషేక్‌రెడ్డితో పాటు ఆయన తల్లిదండ్రులు రవికుమార్‌రెడ్డి, రాధికా రెడ్డిలను దుశ్శాలువా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మానవతా సభ్యులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సిడిఎస్‌కు ఎంపికైన ఏకైక వ్యక్తిగా నిలవడం మండల వాసులకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షులు సాయిరాం, గౌరవ సలహాదారులు ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి, అడ్వైజర్ బోర్డు సభ్యులు, తిరుమల విశ్వనాథం, దొడ్లవాగు శ్రీనివాసులు, రంగారెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి, కంచర్ల సుధీర్‌రెడ్డి హరిప్రసాద్, పిక్కిలి బాబు, పృథ్వీ, రెడ్డి, శంకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు సక్రమమే : రాచమల్లు

ప్రొద్దుటూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు వ్యవహారంలో అంతా సక్రమంగానే జరిగిందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో రూ.371 కోట్లు దుర్వినియోగమైంది వాస్తవమేనని తెలిపారు. ఇందుకు రింగ్ మాస్టర్ చంద్రబాబు నాయుడు అని తేలినాకనే అన్ని ఆధారాలతో అరెస్టు చేశారని పేర్కొన్నారు. గంటా సుబ్బారావ్ అనే వ్యక్తిని నియమించి అతనికి నాలుగు పదవులు ఇచ్చి అతని ద్వారా కథ నడిపారన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు సంబంధం లేకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బాబుపై నమోదు చేసిన తొమ్మిది రకాల సెక్షన్లలో 409 సెక్షన్ 10 సంవత్సరాల కన్న పైబడిన శిక్ష కాబట్టి ముందస్తు నోటీస్ అవసరం లేదన్నారు. ముందుగా ఎఫ్ఐఆర్‌లో లేకున్నా సిఐడి విచారణలో తేలింది కాబట్టి స్పీకర్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి అరెస్టు చేశారన్నారు. అరెస్టు అక్రమమని చెబుతున్న వారు సిఐడిపై కేసు వేయాలన్నారు.

ఇసుక తరలింపుపై గ్రామస్తుల ఫిర్యాదు

చాపాడు : మండల పరి ధిలోని వెదురూరు గ్రామ సమీపంలోని పెన్నా నది నుండి జగనన్న కాలనీల పేరుతో నిరంతరం ఇసుక తరలిస్తున్నారని ప్రజలు పోలీసులకు ఫిర్యాదు. ఏడు ట్రిప్పర్ లారీలను పోలీ సులకు అప్పగించారు. ఎస్ఇబి సిఐ మోహన్‌రెడ్డి, స్థానిక పోలీసులు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు టిప్పర్లను స్టేషన్ వద్ద ఉంచారు. గ్రామంలో నిరంతరం ఇసుకను తరలిస్తూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడం వల్ల సమస్యలు తలెత్తు తున్నాయని ప్రజలు ఫిర్యాదులో పేర్కొన్నారు. జగనన్న కాలనీల పేరుతో ఇసుక అక్రమ తరలింపునకు చర్యలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఒక జగనన్న కాలనీలకు తరలి వెళ్తుందా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారా అని విచారించి చర్యలు చేపట్టాలన్నారు.

రైతులకు రాయితీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి-వీరబల్లి

రైతు భరోసా కేంద్రంలో రాయితీపై అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియం చేసుకోవాలని మట్లి సర్పంచ్ సోమవారపు నాగార్జునచారి తెలిపారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ విత్తిన రైతులకు ప్రభుత్వం కరువు ఆధారిత ప్రణాళిక కింద 80 శాతం రాయితీపై ఉలవలు పంపిణీ చేస్తోందన్నారు. మంగళవారం రైతు భరోసా కేంద్రంలో రైతు లకు అగ్రికల్చర్ అసిస్టెంట్ మంజుషాతో కలిసి రైతలకు ఉలవలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పట్టాదారు పాస్ కలిగిన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ ద్వారా ఉలవలను పంపిణీ చేస్తున్నామన్నారు.మట్లి గ్రామ పంచాయతీకి మొత్తం 320 బ్యాగుల వచ్చాయన్నారు పది కేజీల ఉలవలు బ్యాగ్ రూ.1080లు ఉండగా ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రూ.216లకే అంది స్తోందన్నారు. ప్రభుత్వం వేరుశనగ పంట వేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటగా ఉలవపంటను సాగుచేసుకోవలన్నారు. ఉలవ పంట ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు పశువులకు దాణాగా కూడా ఎంతో ఉపయోగపడు తుందన్నారు.వ్యవసాయ,పండ్ల తోటలు సాగు చేసే అన్న దాతలు అధికారులు సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. సాగు చేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అన్ని కూడా రైతు బరోసా కేంద్రంలో అందు బాటులో వుంటాయని వాటిని రైతులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణంనాయుడు, పి.చెన్నకేశవులు, పి.ధర్మయ్య, పి.సురేష్‌నాయుడు, పర్వతరెడ్డి, కణితి వెంకట్రాము, రామయ్య పాల్గొన్నారు.

నేడు రామసముద్రంలో..

రామసముద్రం : ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో మూగవాడి, కుదురు చీమనపల్లి, మాలేనత్తం పంచాయతీలలో బుధవారం ఉలవలు పంపిణీ

వీరబల్లి : ఉలవలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగార్జునచారి

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నారాయణస్వామి, ఎంపిపి కుసుమ కుమారి, సింగల్ విండో నాయకులు కేశవరెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, వైస్ ఎంపిపి రమణారెడ్డి, జిల్లా వైసిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొండూరు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **నిమ్మనపల్లిలో :** రాయితీపై రైతులకు ఉలవలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. ప్రభుత్వం రైతులకు 80 శాతం రాయితీ పై ఉలవలను అందిస్తున్నాదన్నారు. మధ్యాహ్నం రెడ్డివారిపల్లి సచివాలయం వద్ద ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం పై ఒక్కొక్క రైతుకు పది కేజీల ఉలవలను, కేజీ రూ.22 ల చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద 240 క్వింటాల ఉలవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావలసిన రైతులకు ఇదివరకే రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, వారందరికీ ఉలవలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

మదనపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్కూల్ గేమ్స్ పోటీలను ఎంఇఒలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్‌లు ప్రారంభించారు. మండలంలో మంచి సామర్థ్యం ఉన్న జట్లను నియోజకవర్గ పోటీలకు ఎంపిక చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణకు మారుపేరని తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మండల కో-ఆర్డినేటర్ శివశంకర్, నాగరాజ, రమేష్, సుధాకర్, ఆన్సర్, నరేష్, రాంబాబు, బ్యూలా, జలజ, మండల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా కారులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండల స్థాయి గేమ్స్ ఎంపికలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ క్రీడా ఎంపికలకు ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు మునుస్వామినాయక్, ప్రభాకర్, మురళీధర్, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్, పీడీ తాజ్‌బాషాలు హాజరయ్యారు. మొదటి రోజు 14 సంవత్సరాల నుంచి 17 సంవత్స రాలలోపు వయస్సు గల విద్యార్థులకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 300 మంది విద్యార్థు ల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.శివశంకర్, వై.రాజేశ్వరి, బి.మహేంద్ర, ఎస్.సుబ్బయ్య, ఎం.విజయ కుమారి, బి.గీత పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో బుధవారం నుంచి 16వ తేదీ వరకు మండల స్థాయి ఆటల పోటీలు జరుగుతాయని ఎంఇఒలు త్యాగరాజు, నాగసు బ్బరాయుడు తెలిపారు.13, 15, తేదీలలో తంబళ్లపల్లి ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 విభాగాలలో బాల బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెనికాయిట్ యోగ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్ త్రోబాల్, ఆటల పోటీలు జరుగుతాయన్నారు.16న కన్యమడుగు ఉన్నత పాఠశాల మైదానంలో అథ్లెటిక్స్, రన్నింగ్ పరువు పందెం, లాంగ్ జంప్, హైజంప్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన బాల, బాలికలు ఆయా పాఠశాల పిఇటిల ద్వారా పోటీలలో పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో గెలిచిన వారికి నియోజకవర్గస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. **నిమ్మనపల్లి :** విద్యార్థులు క్రీడల్లో రాణించాలని నిమ్మనపల్లి జడ్‌పి హైస్కూల్ (తెలుగు) ప్రధానోపాధ్యాయులు అంజాద్ అలీఖాన్ అన్నారు. జడ్‌పిహైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 నుంచి 17 సంవత్సరాలలోపు విభాగాలలో బాల బాలికలకు మండల స్థాయి క్రీడల పోటీలను నిర్వహించారు. స్థానిక హై స్కూల్లో ఖోఖో, బ్యాట్మెంటన్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తే 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 114 మంది పై స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన రెడ్డివారిపల్లి ఆదర్శపాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, త్రో బాల్, టెన్నికాయిట్ క్రీడా పోటీలలో 200 మంది విద్యార్థులు పాల్గొనగా 128 మందిని పైస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఇటిలు భద్రయ్య, మణికంఠ పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తాం : వైసిపి

పల్లెబాట కార్యక్రమంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయని స్తోందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మొటుకుపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, మస్తాన్, ఎంపిడిఒ శంకరయ్య, ఎంపిపి లక్ష్మినరసమ్మ, జడ్‌పిటిసి రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలోని పదిగ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుక రావాలని చెప్పారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి మండలంలో రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లతో పాటు మౌళిక ఏర్పాటు చేశారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డితో, ద్వారకనాథ్‌రెడ్డి మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెయింట్ వెంకటరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఖాదరవల్లి, కో-ఆప్షన్ మెంబర్‌నాసిర్, ఎంఇఒ రెడ్డిశేఖర్, హౌసింగ్ అధికారి లావణ్య, సర్పంచులు, ఎంపిటిసిలు, సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ అబ్దుల్‌జహీర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వినాయకుని మండపాల వద్ద ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే స్పీకర్లను వాడాలని గణేష్ ఉత్సవాల మండపాలకు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా కాల్చడం, పెద్ద పెద్ద శబ్దాలతో మైకులను ఏర్పాటు చేయడం వంటివి చేయకూడదన్నారు. రహదారులకు అడ్డంగా ఎట్టి పరిస్థితుల్లో విగ్రహాల ఏర్పాటు చేయకూడదన్నారు. వినోద కార్యక్రమాలలో అశ్లీల డ్యా న్సులు లేకుండా సంప్రదాయ బద్ధంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విగ్రహ కమిటీ చూసుకో వాలన్నారు. నిమజ్జనాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ అంత రాయం లేకుండా ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని నిబంధన తప్పనిసరిగా పాటించాలన్నారు. పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

చిట్వేలి : మండలంలో వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాలు ప్రతిష్టించే వారు తప్పనిసరిగా పోలీస్‌శాఖ అనుమతులు

వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ అబ్దుల్‌జహీర్

తీసుకోవాలని ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఎఇ తోపాటు, సౌండ్ సిస్టం కొరకు డిఎస్‌పి అనుమతి తప్పని సరిగా తీసుకో వాలన్నారు. పోలీసు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మండపాల వద్ద నిర్వాహకులు తప్పకు ఉండానలి సూచించారు. ప్రశాంత వాతావరణంలో వినాయకుని సంబరాలు జరుపుకోవాలని, అలా కాకుండా ఎవరైనా సహచరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

'సహారా' సంస్థపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రజల వద్ద డబ్బు వసూలు చేసి తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న సహారా క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సంస్థపై అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వ ర్యంలో మంగళవారం తాడి పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా పైన మూత వేసిన సహారా కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సం దర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కొన్నేళ్ళుగా జమ్మలమడుగు పట్టణంలో పేద, మధ్య తరగతి కుటుంబ ప్రజల నుంచి రోజువారీగా కొంత సొమ్మును కొంతమంది ఏజెంట్లు ద్వారా చెల్లిస్తూ వచ్చారన్నారు. నాలుగేళ్ల తర్వాత కట్టిన మొత్తానికి కొంత వడ్డీ వేసి ఇస్తూ వచ్చారన్నారు. ఇది నమ్మిన ప్రజలు ఇతర గ్రామాల వారు సైతం సహారాలో డబ్బులు ఎక్కువ మొత్తంలో కట్టారన్నారు. నాలుగు నెలలుపైగా ఏజెంట్లు ప్రజల వద్దకు డబ్బులు కట్టించుకోవడానికి రావడం తగ్గించారని, తర్వాత పూర్తిగా మానేశారన్నారు. కొంత మందికి కాలపరిమితి అయిపోయినా కట్టిన డబ్బులు ఇవ్వాలని ప్రజలు వెళితే కార్యాలయం మూసేశారన్నారు. నెల రోజులుగా సహారా కార్యాలయం మూత వేసే ఉందన్నారు. కట్టిన డబ్బులు రాక ఎవరిని అడగాలో తెలియక బాధితులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జమ్మలమడుగులోనే వంద మందికి పైగా ఖాతాదారులు ఉన్నారన్నారు. కొందరికి రూ.70వేలు, మరికొందరికి రూ.20 వేలు, రూ.15 వేలు, ఇలా లక్షల రూపాయలు సహారా క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సంస్థ ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు సూరి, ఆంజనేయులు, భరత్, నవీన్ పాల్గొన్నారు.

శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయము
దొడ్డిపల్లి (గ్రా), పీలేరు (మం), అన్నమయ్య జిల్లా.
e-Procurement Tender
NIT NO. ENDOW-ADMN/23/2023-JA(B4)Dt: 22-08-2023
ప్రొటెక్షన్ గోడ నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమై నది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : సి.రవీంద్రరాజు
కార్యనిర్వహణాధికారి, సెల్: 93986 62648

గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సూపర్వైజర్

గర్భిణులు సమతుల్య ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మహిళలతో పాటు గర్భిణులు, బాలింత మహిళలు సమతుల్య పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదని అంగన్వాడీ సూపర్వైజర్ నిర్మలాదేవి పేర్కొన్నారు. మంగళవారం కొమ్మనవారిపల్లి సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మహోత్సవాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకి తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అంగన్వాడీ సూపర్వైజర్ వివరించారు. పౌష్టికాహారమును బిడ్డలకి సకాలంలో ఇవ్వాలన్నారు. సకాలంలో మంచి సమతుల్య ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కొమ్మనవారిపల్లి గ్రామసర్పంచ్ రాములమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్, ఎఎన్ఎం లలిత, ఎడబ్ల్యుడబ్ల్యు చెంచులక్ష్మి, స్వర్ణలత, దేవసేన, ఏసమ్మ, సరస్వతి, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం ఖాదర్‌వలి

సంఘాలు పంచ సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

సంఘాలు పంచ సూత్రాలు పాటించాలని వైఎస్ఆర్ క్రాంతిపథం సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి కోరారు. మంగళవారం సోమవరం వడ్డెపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బలోపేతానికి పంచసూత్రాలు పాటించడం ఉత్తమమని చెప్పారు. క్రమం తప్పని సమావేశాలు, ఒకరి కోసం అందరూ, అందరి కోసం ఒకరు, అంతర్గత రుణాలు ఇవ్వడం,ఇచ్చిన రుణాలు వంద శాతం వసూళ్లు, పుస్తక నిర్వహణ మొదలైనవి సక్రమంగా జరపడం వల్ల సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. సంఘాలలో జరిగే లావాదేవీలు సభ్యులందరికి తెలపడం ద్వారా పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ నాగేంద్ర, విఒఎ విజయమ్మ, సమాఖ్య అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి రాధిక, కోశాధికారి రెడ్డెమ్మ, పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-పీలేరు



మాట్లాడుతున్న డిపో మేనేజర్ బండ్లకుమార్

ఆర్‌టిసి స్థలాల అద్దెకు ఇవ్వడంపై ఔత్సాహిక వ్యాపారులు, పారిశ్రామి కవేత్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ బండ్ల కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరు లతో మాట్లాడుతూ పీలేరు బస్టాండు ఆవరణంలోని 2,382 చదరపు గజాల స్థలం, కలికిరి బస్టాండులోని 629 చదరపు గజాల స్థలాలను 15 ఏళ్ల పాటు అద్దెకు ఇవ్వడానికి ఆర్‌టిసి ఆమోదించిందన్నారు. ఔత్సాహిక వ్యాపారస్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఆర్‌టిసి యాజమాన్యం 15 ఏళ్ల అద్దె స్కీం గురించి, ఈనెల 15న మదనపల్లె బస్టాండులో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ప్రజా రవాణాధికారి పి.రాము ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారని తెలిపారు. కావున ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ సదస్సుకు హాజరుకావాలని కోరారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో రాష్ట్రంలో మాఫియా రాజ్యం సాగుతోందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోడీ పాలనలో దేశంలో సబ్ కా వికాస్ బదులు సబ్ కా వినాస్ అమలవుతోందన్నారు. మోడీ పాలనలో దేశం అప్పుల భారత్ అయినట్లు చెప్పారు. 9ఏళ్లల్లో రూ.109 లక్షల కోట్లు అదనపు అప్పు కేంద్రం చేసిందన్నారు. నౌకాశ్రయం, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అమ్మేస్తున్నట్లు చెప్పారు. వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు అందుబాటులో లేవన్నారు. 14 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేకహోదాకు కేంద్ర ప్రభుత్వం పంగనామాలు పెట్టిందని విమర్శించారు. కక్ష రాజకీయాలు పరాకాష్టకు చేరాయన్నారు. తాలిబన్ల పాలన కంటే జగన్ పాలన మించిపోయిందని తెలిపారు. కాంగ్రెసు అధికారంలోకి వస్తే 6 సూత్రాల పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు శివారెడ్డి, బద్రి, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గండిక్షేత్రం రామానంద్ స్వామి మృతి

చక్రాయపేట : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రం పడమర వైపు ఉన్న కైలాస ఆశ్రమం శివాలయం శ్రీశ్రీశ్రీ యోగి రామానంద యతీంద్రుల స్వామి కడప నగరం జివిఆర్ టవర్స్‌లోని డాక్టర్ వంశీకృష్ణ శశిబిందు నివాసంలో మంగళవారం తుది శ్వాస విడిచారు. వీరు చిన్న నాడే ముస్లిం మతస్తుడైనప్పటికీ శివుని దేవా లయంతోపాటు పరమటి వైపున ఉన్న పలు దేవాలయాలు వీరి ద్వారానే ఏర్ప డ్డాయి. ఆయన మృతదేహాన్ని మంగళ వారం సాయంత్రం గండి క్షేత్రం పరమర వైపున ఉన్న శివాలయంకు చేర్చారు. అంతక్రియలు (మహాప్రస్థాన) బుధవారం మూడు గంటలకు గండి క్షేత్రంలోని స్వామివారి కైలాస ఆశ్రమం (శివాలయం)లో జరుగును.

కాలుష్యాన్ని నియంత్రించాలంటూ సిఇకి వినతి

ఎర్రగుంట్ల: మండల పరిధిలోని థర్మల్ విద్యుత్ కేంద్రం చిమ్నీల ద్వారా కాలుష్యం అధికంగా వెలువడుతోందని, దీన్ని నియంత్రించాలంటూ కలమల్ల గ్రామ రాంప్రసాద్, కుమార్‌రాజా, మునిరాజా మంగళవారం ఆర్‌టిపిపి చీఫ్ ఇంజనీర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిమ్నీల ద్వారా వెలువడు కాలుష్యంతో కలమల్ల గ్రామ ప్రజలు శ్వాసకోశ, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ట్యాంకర్ల గేటు వద్ద రోడ్డుపైనే టిప్పర్లు ఆపడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. బూడిదతో కూడిన నీళ్లు గ్రామానికి చెందిన వంకలో కలవడంతో నీరు మొత్తం కలుషితం అవుతోందని తెలిపారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి-గాలివీడు

చోరీ కేసులో ఇద్దరు నిందితులో ఒకరిని రిమాండ్‌కు మరొకరి బాలల గృహానికి తరలించినట్లు స్థానిక ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..కర్ణాటక రాష్ట్రం కోలార్‌జిల్లా, బంగారుపేటకు చెందిన చిన్నా, పవన్‌లు స్థానిక పంచాయతీ పరిధిలో గుర్రాలమెట్ట వద్ద కోళ్లు దొంగిలించేందుకు వచ్చి ఇంటిలోకి ప్రవేశించి రూ.10వేలు చోరీ చేసి పరావుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వారిని లక్కిరెడ్డిపల్లి కోర్టులో హాజరు పరచగా చిన్నాకు రిమాండ్‌కు, పవన్ మైనర్ కావడంతో కడపలోని బాలల గృహానికి తరలించినట్లు చెప్పారు.